సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 3 । జనవరి । 2023



కేసుల ఛేదనే లక్ష్యంగా..

శ్రీకాకుళం టూటౌన్ సీఐ చక్కటి ప్రతిభ కనబరుస్తున్నారు. కేసుల ఛేదనే లక్ష్యంగా పనిచేస్తున్నారు.

- 8లో



ఆ మీటింగ్‌లు బహిష్కరించాలి

చంద్రబాబు మీటింగ్‌లు బహిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు అంటున్నారు. జనం ప్రాణాలతో ఆడుకుంటున్నారన్నారు.

- 8లో

ట్రిపుల్ ఐటీకి 7 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ (రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం)కు ఈ నెల 7 నుంచి 17 తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఇవ్వనున్నట్లు అకడమిక్ డీన్ మోహన్ కృష్ణ తెలిపారు. ట్రిపుల్ ఐటీలో సోమవారం మాట్లాడుతూ 18వ తేదీ నుంచి క్లాస్ వర్క్ ఉంటుందని తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు సిక్కోలు డ్వాక్రా బజార్ ప్రారంభం

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళంలో మంగళవారం సిక్కోలు డ్వాక్రా బజారు ప్రారంభిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డాక్టర్ డీవీ విద్యా సాగర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఏడు రోడ్ల కూడలి వద్ద గల నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల మైదానంలో 2023 జనవరి 3 నుంచి 9 వరకు ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9.30గంటల వరకు డ్వాక్రా బజారు తెరచి ఉంటుందని పేర్కొన్నారు. ఈ బజారులో స్వయం సహాయక బృందాలు తయారు చేసిన వివిధ వస్తువులను ప్రదర్శించడంతో పాటు విక్రయించనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

నేడు వర్సిటీలో ఖాళీ పీజీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పీజీ కోర్సుల్లో ఖాళీ సీట్లకు మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ చెప్పారు. విశ్వవిద్యాలయంలో సోమవారం వివరాలు వెల్లడించారు. కోర్సుల వారీగా ఖాళీ సీట్లకు ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఏపీ స్టేట్ పీజీ సెట్-2022 ఉత్తీర్ణత సాధించిన వారు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులని వివరించారు. సైన్స్, ఆర్ట్స్ కళాశాలల్లో ఉదయం 10 గంటలకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు.

వలస మత్స్యకారుడు మృతి



తోటయ్య (ఫైల్)

ఎచ్చెర్ల: మండలంలోని బుడగట్ల పాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు కారి తోటయ్య (44) కర్నాటక రాష్ట్రం మంగుళూరులో సముద్రంలో మునిగి చనిపోయాడు. ఈయన పొట్టకూటి కోసం కర్నాటక మంగళూరు ప్రాంతానికి వలస వెళ్లాడు. గత నెల 30న సముద్రంలోకి వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు సంద్రంలో పడిపోయాడని స్థానికులు చెబుతున్నారు. ఈయన మృతదేహం సోమవారం లభ్యం కావటంతో ఈయన భార్య సూర్యకుమారికి సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులతో పాటు మాజీ సర్పంచ్ అంబటి రాంబాబు, మద్దు లక్ష్మణరావులు వెళ్లి మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక నాయకులు కోరుతున్నారు.

ఆటో ఢీ కొని వ్యక్తి మృతి



సత్యనారాయణ మూర్తి మృతదేహం

కోటబొమ్మాళి: స్థానిక మెయిన్ రోడ్డులోని స్టేట్ బ్యాంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళి విలేకరుల కాలనీకి చెందిన నౌపడ సత్యనారాయణమూర్తి(50)మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సోమవారం సాయంత్రం సత్యనారాయణమూర్తి ఏటీఎంకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కోటబొమ్మాళి వైపు నుంచి కొత్తపేట వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు, శరీరంపై బలమైన దెబ్బలు తగిలాయి. స్థానికులు 108 వాహనంలో స్థానిక ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఈయన గతంలో పత్రికా విలేకరిగా పనిచేశారు. మృతునికి భార్య బాలసోమేశ్వరి, కుమార్తె తనుశ్రీ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ నాగభూషణ రావు తెలిపారు.

డిగ్రీ మూల్యాంకనం ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో డిగ్రీ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల 4వ సెమిస్టర్ రెగ్యులర్, 2వ సెమిస్టర్ సప్లిమెంటరీ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ సోమవారం మొదలైంది. మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, కామర్స్, బోటనీ, జువాలజీ, హిస్టరీ, పాలిటిక్స్, ఎకనామిక్స్, కంప్యూటర్‌సైన్స్, స్పెషల్ తెలుగు, స్పెషల్ ఇంగ్లిష్ తదితర పేపర్లకు సంబంధించిన దిద్దుబాటు ప్రక్రియను ప్రారంభించినట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు దిద్దుబాటు జరుగుతుందని, అర్హత కలిగిన ఎగ్జామినర్లంతా తప్పనిసరిగా రిపోర్ట్ చేయాలని ఆయన సూచించారు.

ముక్కోటి.. తరించిన భక్తకోటి



మందస: శ్రీవాసుదేవ పెరుమాళ్‌స్వామి సన్నిధిలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న మహిళలు



గార: గరుడ వాహనంపై ఊరేగింపునకు వెళ్తున్న శ్రీకూర్మనాథుడు



అరసవల్లిలో ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న అర్చకులు

ముక్కోటి ఏకాదశి పర్వదినాన వైకుంఠ ద్వార దర్శనానికి భక్తకోటి పోటీ పడింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న వైష్ణవ క్షేత్రాలు సోమవారం కళకళలాడాయి. ఉత్తర ద్వార దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. స్వామి దర్శనాలతో పులకించిపోయారు. పవిత్ర ఏకాదశి నాడు అన్ని ఆలయాల్లో స్వామి మూర్తులను అందంగా అలంకరించారు.



అరసవల్లిలో ఉత్తరద్వారం గుండా స్వామిదర్శనానికి వెళ్తున్న భక్తులు



శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమలలో భక్తురాలు



అరసవల్లి: ఉత్తర ద్వారం వద్ద భక్తుల రద్దీ



శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమలలో గరుడవాహనంపై స్వామివారు

జలాశయం నిండేలా..
జనాశయం నెరవేరేలా

- వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు టెండర్లు ఖరారు
- పోటీపడిన మూడు సంస్థలు
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు దక్కిన వర్క్
- గొట్టా బ్యారేజీ ఎగువన లిఫ్ట్ ఏర్పాటు
- 2.5కిలోమీటర్ల దూరంలో హిరమండలం రిజర్వాయర్‌కు వంశ'ధార' ఎత్తిపోత

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: వంశధార జలాశయం నిండేలా.. పరివాహక ప్రాంత జనుల ఆశయం నెరవేరేలా మరో ముందడుగు పడింది. హిరమండలంలోని వంశధార జలాశయం నిండాలంటే ఎక్కడో ఎగువన నేరడి వద్ద బ్యారేజీ కట్టాలి. కానీ, దానికి ఒడిశా నుంచి అడ్డంకులు ఉన్నాయి. ఇవన్నీ తొలగి, నిర్మాణాలు జరిగితేనే గాని పచ్చని పొలాలకు నీరందదు. అంతవరకు పొలాలన్నీ ఎదురు చూడాలి. ఈ నిరీక్షణకు తెర దించుతూ ప్రభుత్వం కొత్త ఆలోచన చేసింది. గొట్టా బ్యారేజీ వద్ద నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్‌కు పంపిస్తే వరద నీరు సముద్రం పాలు కాకుండా సంరక్షించే కార్యక్రమానికి నడుంబిగించింది. రూ.176కోట్లకు పైగా ఖర్చుతో ఏకంగా ఎత్తిపోతల పథకాన్ని నిర్మించబోతోంది. ఈమేరకు టెండర్లు ఖరారయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. దీంతో పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

అన్నీ ఉన్నా అందని వంశ'ధార'..

సిక్కోలు పొలాలు మూడు కాలాలూ పచ్చగా ఉండాలంటే వంశ'ధారే' ఆధారం. దాదాపు 2.50లక్షల హెక్టార్లు ఖరీఫ్, రబీల్లో పంటలతో కళకళలాడాలంటే వంశధార జలాలు అందాలి. దాని కోసం మహానేత వైఎస్సార్ హయాంలో భగీరథయత్నమే జరిగింది.

- వంశధార స్టేజ్ 2లో ఫేజ్ 2 పనులు చేపట్టారు.
- 87,88 ప్యాకేజీ పనులు దాదాపు 90శాతం పూర్తయ్యాయి.
- 19.5టీఎంసీల సామర్థ్యంతో హిరమండలం రిజర్వాయర్ కూడా సిద్ధమైంది.
- కానీ ఒడిశా పరిధిలో నేరడి వద్ద ఆనకట్ట కడితే తప్ప నీరు ప్రవహించదు. ప్రస్తుతం సైడ్ వియర్ ద్వారా రిజర్వాయర్‌కు నీరు మళ్లిస్తున్నా అది సరిపోవడం లేదు.
- వరద కాలువ ద్వారా 3నుంచి 5టీఎంసీల నీరు మాత్రమే వస్తోంది. దీంతో వంశధార ప్రాజెక్టు ఉన్నా రైతులకు మేలు జరగడం లేదు.



వంశధార కాలువ



ప్రాజెక్టు మ్యాప్

లిఫ్ట్‌తో పరిష్కారం..

జిల్లాలో అత్యధిక ఆయకట్టులో మూడు పంటలు పండాలంటే మండు వేసవిలో వంశధార కాలువ నిండుగా ప్రవహించాలి. హిరమండలంలోని వంశధార రిజర్వాయర్‌కు 19.5 టీఎంసీల నీరు వచ్చి చేరాలి. ఇప్పుడా పరిస్థితి లేదు. ఖరీఫ్‌లోనే పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరందడం లేదు. ఇక రబీ కోసమైతే చెప్పనక్కర్లేదు.

- 19.5 టీఎంసీల నీటిని తీసుకొస్తే మూడు పంటల సాకారం నెరవేరుతుంది.
- ప్రస్తుతం హిరమండలం రిజర్వాయర్‌లో డెడ్ స్టోరేజ్ కింద 2.5టీఎంసీల నీరు ఉంటుంది.
- ఫ్లడ్‌ఫ్లో కెనాల్, కొండ చరియల నుంచి వచ్చే నీరు మరో 4టీఎంసీలు ఉంటుంది.
- మిగతాది నింపాలంటే ఒకటి నేరడి బ్యారేజీ నిర్మాణం పూర్తి చేసి నదిలో నీటిని మళ్లించడం, లేదంటే గొట్టా బ్యారేజీ వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేయడమే మార్గం. అయితే, నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు కారణంగా ఈ లోపు మొత్తం ఆయకట్టును సస్యశ్యామలం చేయాలంటే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ తప్పనిసరి. ఇప్పుడదే ఆలోచనతో ప్రభుత్వం చొరవ తీసుకుంది. ఈ కల నెరవేర్చేందుకు అడుగులు వేస్తోంది.
- గొట్టా బ్యారేజీ ఎగువన కోరాడ గ్రామం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించి సుమారు 100రోజుల కాలంలో 16గంటల పాటు పంపింగ్‌తో 2.5కిలోమీటర్ల దూరంలో ఉన్న హిరమండలం రిజర్వాయర్‌కు 12టీఎంసీలకు పైగా నీటిని లిఫ్ట్ చేయనున్నారు. దాని వల్ల ఖరీఫ్, రబీలో మొత్తం ఆయకట్టుకు నీరందనుంది.

"వచ్చే ఖరీఫ్‌కు నీరిస్తాం



నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఒడిశా నుంచి అభ్యంతరాలు ఉండడంతో కొంతకాలం పాటు జాప్యం జరిగే అవకాశం ఉంది. అందుకు ప్రత్యామ్నాయంగా హిరమండలం గొట్టా బ్యారేజీ వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేసి రిజర్వాయర్‌లో 19 టీఎంసీల నీటిని జిల్లా రైతులకు రెండు పంటలకు ఇచ్చేందుకు కృషి చేస్తున్నాం. పూర్తి స్థాయిలో ఈ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రూ.176.30 కోట్లుతో పనులు చేపట్టి రానున్న ఖరీఫ్ నాటికే నీరిచ్చేందుకు ప్రయత్నం చేస్తాం. జిల్లా రైతులకు ఇదో వరంలా మారుతుంది. - డోల తిరుమలరావు, ఎస్ఈ, బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు, శ్రీకాకుళం.

కాంట్రాక్ట్ దక్కించుకున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్

వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలిచింది. మూడు ప్రధాన సంస్థలు పాల్గొన్నాయి. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్స్, కావేరీ ఇంజినీరింగ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు వర్క్ కోసం పోటీ పడ్డాయి. వీటిలో తక్కువ కోట్ చేసిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ టెండర్ దక్కించుంది. ఎస్టిమేటెడ్ కాస్ట్ వాల్యూ రూ.135కోట్ల 85లక్షల 339గా ప్రభుత్వం నిర్దేశించగా, దానికి 3.69శాతం యాక్సెస్‌తో రూ. 140కోట్ల 16లక్షల 69వేల 425కు కోట్ చేసి, టెండర్లలో పాల్గొన్న సంస్థల్లో తక్కువ కోట్ చేసిన సంస్థగా నిలిచి వర్క్ కైవసం చేసుకుంది. ఇప్పటికే అన్ని ఒప్పందాలు జరిగిపోయాయి. త్వరలోనే పనులకు శంకుస్థాపన జరగనుంది.

జాతీయ వాలీబాల్ పోటీలకు ముగ్గురు ఎంపిక



అప్పలనాయుడు



భానుప్రసాద్



శ్రావణి



శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ వాలీబాల్ పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు ఆలిండియా సబ్‌జూనియర్స్ బాలబాలికల వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు జిల్లా నుంచి బాలురు విభాగంలో వండాన అప్పలనాయుడు(కోటపాలెం), ముడిరాన భానుప్రసాద్ (రామకృష్ణాపురం), బాలికల విభాగంలో బి.శ్రావణి (లోపెంట) ఎంపికయ్యారు. వీరు ముగ్గురు ఆంధ్రప్రదేశ్ బాలబాలికల జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇప్పటికే వీరు రాష్ట్రవాలీబాల్ బృందంతో కలిసి ఢిల్లీ చేరుకున్నారు. వీరి ఎంపికపై శ్రీకాకుళం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శి యాళ్ల పోలినాయుడు, పి.సుందరరావు, కార్యనిర్వహక కార్యదర్శి కె.రామచంద్రుడు, కోశాధికారి టి.రవి, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎం.మాధురీలత, వాలీబాల్ కోచ్ కె.హరికృష్ణ, సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు డయల్ యువర్ జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యం కొనుగోళ్లలో సమస్యల పరిష్కారానికి మంగళవారం డయల్ యువర్ జేసీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని, ఫిర్యాదులు, సమస్యలు తెలియజేయాలనుకునే వారు 78933 00311 నంబర్‌కు కాల్ చేయాలని ఆమె సూచించారు. వచ్చే వారం నుంచి ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆర్‌బీకే నిర్మాణంలో జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం

రణస్థలం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పక్కా భవనాల నిర్మాణాలు శరవేగంగా జరపాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. మండలంలోని కోష్ట, నారువ గ్రామ సచివాలయాలను సోమవారం ఆయన సందర్శించారు. తొలుత కోష్ట గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలించి భవన నిర్మాణాలు ఎంతవర కు వచ్చాయో ఆరా తీశారు. రైతు భరోసా కేంద్రం నిర్మాణం ఎందుకు ఆలస్యమవుతోందని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ జేఈ కూర్మనాథంను ప్రశ్నించారు. నిర్మాణ ప్రదేశం వద్దకు వెళ్లి ఇంకా పునాది లెవెల్ కూడా రాకపోవడానికి, ఆలస్యానికి గల కారణాలు అడిగారు. ఆర్‌బీకేలోకి నీరు వస్తోందని జేఈ చెప్పగానే... పక్కన ఉన్న చెరువు గర్భంలో కట్టారా అంటూ నిలదీశారు. మూడేళ్లయినా ఇంకా గ్రౌండింగ్ లెవెల్‌లోనే ఉండడంపై జేఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువు గర్భం అయితే స్థలం మార్చి జనవరి చివరి కల్లా నిర్మాణం పూర్తి చేయాలని అన్నారు. శరవేగంగా గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల భవనాల నిర్మాణాలు జరగాలని ఆదేశించారు. అనంతరం నారువ గ్రామ సచివాలయంలోని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరును, రికార్డులను, బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ రీ-సర్వే ఎంతవరకు వచ్చిందో అడిగి తెలుసుకున్నారు. మీ పరిధిలో మీకు అప్పగించిన పనులను పక్కాగా చేయాలని అన్నారు. మండలంలోని జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణం వంద శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎస్ డీటీ హేమసుందర్, ఎలక్షన్ డీటీ జీ.కె. శ్రీనివాస్, ఎంపీడీఓ ధనుంజయరావు, హౌసింగ్ ఏఈ మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎస్పీ స్పందన@24



మహిళల నుంచి ఫిర్యాదు వింటున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ స్పందనకు ఫిర్యాదుదారుల నుంచి 24 అర్జీలు అందినట్లు ఎస్పీ జీఆర్ రాధిక వెల్లడించారు. ఎస్పీ మాట్లాడుతూ స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం ఉండకూడదని, నిర్ణీత సమయంలో విచారించి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాంచారు. ఫిర్యాదుల్లో కుటుంబ తగాదాలు 3, సివిల్ 4, ఆస్తి తగాదాలు 4, పాతవి 6, ఇతర అంశాలపై 7 అందాయన్నారు.

ఆట విడుపుగా..

శ్రీకాకుళంలోని పీఎన్ కాలనీలో రూ.55 లక్షల వ్యయంతో పార్కును నిర్మించారు. ఈ పార్కు ను మంత్రి ధర్మాన ప్రసాద రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇలా కాసేపు సరదాగా గడిపారు. - శ్రీకాకుళం పీఎన్ కాలనీ



నవోదయలో ప్రవేశానికి దరఖాస్తులు



శ్రీనివాసరావు

నరుబుజ్జిలి: వెన్నెలవలస వద్ద గల జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-24 విద్యాసంవత్సరానికి 6వ తరగతి లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. జనవరి 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు 3, 4వ తరగతులు ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి, 2022-23 విద్యాసంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ఉండాలని వెల్లడించారు. అభ్యర్థులు మే 1, 2011 నుంచి ఏప్రిల్ 30, 2013 మధ్యలో జన్మించి ఉండాలని చెప్పారు. సంబంధిత హెచ్ఎం సంతకంతో కూడిన ధ్రువీకరణ పత్రాన్ని జతచేయాలని సూచించారు. ప్రవేశ పరీక్ష జిల్లాలోని ప్రధాన కేంద్రాల్లో 2023, ఏప్రిల్ 29న నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గౌరిబెత్తి.. పరిగెత్తించింది

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అంబుసోలి చెరువు వద్ద గౌరిబెత్తి అని పిలిచే విష సర్పం అలజడి సృష్టించింది. చెరువులో వేసిన చేపల వలకు చిక్కుకున్న పామును చూసి చేపలు పట్టేవారంతా భయపడ్డారు. అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పామును పట్టుకున్నారు.



స్పందన @150



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్ తదితర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 150 వినతులు వచ్చాయి. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పందనకు జెడ్పీ సీఈఓతో కూడిన ఓ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా అధికారులు లాగ్ ఇన్‌లోకి వెళ్లి పరిశీలించి పెండింగ్‌లో ఉన్న వాటిని అసైన్ యాలని చెప్పారు. కారుణ్య నియామకాలకు సంబంధించి ఖాళీల వివరాల డేటా తక్షణమే అందజేయాలని ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ నుంచి ఎన్ఎస్ఎఫ్‌డీసీ రూ. 16 లక్షల చెక్కులను 10 మంది లబ్ధిదారులకు జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ అందజేశారు.

క్లుప్తంగా

ఆలయ పరిసరాల్లో కోవిడ్ జాగ్రత్తలు



ఎయిర్ ప్యూరిఫైర్‌ను ఈవోకు అందజేస్తున్న దాత నాయుడు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయ పరిసరాల్లో కోవిడ్ ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లుగా ఈవో వి.హరిసూర్యప్రకాష్ వెల్లడించారు. పట్టణానికి చెందిన కె.పి.నాయుడు రూ.18,500 విలువైన ఎయిర్ ప్యూరిఫైర్‌ను ఆలయానికి సోమవారం సమర్పించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ.. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇకపై రద్దీ సమయాల్లో స్వామి దర్శనానికి వచ్చే భక్తులతో పాటు ఆలయ సిబ్బంది కూడా కచ్చితంగా మాస్కులు ధరించాలని సూచించారు. దాత కె.పి.నాయుడు ఇచ్చిన ఎయిర్ ప్యూరిఫైర్‌ను కోవిడ్ నియంత్రణలో భాగంగా ఆలయ అంతరాలయంలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, నేతేటి హరిప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు లైఫ్ సర్టిఫికెట్ సేవలు



రిటైర్ ఉద్యోగికి ఐరిస్ చేస్తున్న దృశ్యం

టెక్కలి: విశ్రాంత ఉద్యోగుల కోసం ఆన్‌లైన్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించే సదుపాయం కల్పించినట్లు టెక్కలి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్.రామచంద్రరావు సోమవారం తెలిపారు. సర్టిఫికెట్ సమర్పించే విషయంలో థంబ్, ఐరిస్ సదుపాయాన్ని స్థానికంగా ఉన్న సంఘ భవనంలో కల్పించినట్లు పేర్కొన్నారు. రోజూ ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సేవలు అందజేస్తామన్నారు. టెక్కలి ట్రెజరీ కార్యాలయం పరిధిలోని 1200 మంది సభ్యులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉందన్నారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల పరిధిలోని విశ్రాంత ఉద్యోగులు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన ఏపీహెచ్‌సీ పరీక్షలు



శివానీలో అభ్యర్థుల హాల్ టిక్కెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ హైకోర్టు ఆధ్వర్యంలో ఉద్యోగాలకు నిర్వహిస్తున్న ఆన్‌లైన్ పోటీ పరీక్షలు సోమవారంతో ముగిశాయి. డిసెంబర్ 21 నుంచి పని దినాల్లో చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాల, ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించారు. చివరి రోజు శివానీలో మొదటి విడతలో 187కి 164, రెండో విడతలో 187కి 163, మూడో విడత 191కి 173 మంది, వెంకటేశ్వరలో మూడు షిఫ్టుల్లో 300కి 262 మంది హాజరయ్యారు. ఈ కళాశాలలో మొత్తం ఎనిమిది రోజులు పరీక్షలు జరగ్గా 2199 మందికి 1903 మంది హాజరయ్యారు. న్యాయశాఖ అధికారులు పరీక్షలను పర్యవేక్షించారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం

నరుబుజ్జిలి: రొట్టవలస గ్రామానికి సమీపంలోని ముంగెన్న చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు పోలీసులు సోమవారం తెలిపారు. మృతుని వయస్సు సుమారు 35 నుంచి 40 ఏళ్లు ఉండవచ్చునని అంచనా వేశారు. ఇన్‌చార్జి వీఆర్వో వందనా గ్రేస్ ఫిర్యాదు మేరకు పోలీసులు చేరుకొని చెరువులోని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతదేహంపై ఎటువంటి దుస్తులు లేకపోవడంతోపాటు గుర్తుపట్టలేనంతగా ఉబ్బిపోయింది. శరీరంపై చిన్నచిన్న గాయాలున్నాయి. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కూటికుప్పల కృష్ణప్రసాద్ తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹128	₹226	₹ 236

కేసుల ఛేదనే లక్ష్యంగా..

- చక్కటి పనితీరు కనబర్చుతున్న టూటౌన్ సీఐ ఈశ్వరప్రసాద్
- పలు అవార్డులు సొంతం

సాక్షి ఇంటర్వ్యూ



జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక నుంచి బెస్ట్ ఫైరింగ్ అవార్డు అందుకుంటున్న సీఐ ఈశ్వరప్రసాద్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్: రిస్క్ ఎక్కడఉంటే అక్కడ ఉంటారు.. హైరిస్క్ ఉంటే మరింత అటెన్షన్ అవుతారు.. ఏవోబీ గ్రేహౌండ్స్, ఏఐటీయూ యాంటీ ఆపరేషన్‌లో చురుకైన పాత్ర పోషించారు. పోలీస్ బెటాలియన్ తరఫున స్టేట్, నేషనల్ స్పోర్ట్స్ అవార్డులు తన ఖాతాల్లో వేసుకున్నారు. ఆయనే శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీఐ ఆర్ఈసీహెచ్ ఈశ్వరప్రసాద్. ఆయన సాధించిన విజయాలు.. ఛేదించిన కేసులను 'సాక్షి'తో పంచుకున్నారు. సోమవారమే ఆయనకు ఇచ్ఛాపురం బదిలీ అయ్యింది.

సాక్షి : విధుల్లో ఎప్పుడు చేరారు. ఇక్కడకు సీఐగా ఎప్పుడు వచ్చారు?

సీఐ: 2002లో విజయనగరం పోలీస్ బెటాలియన్‌లో ఏపీఎస్‌పీ ఎస్ఐగా విధుల్లో చేరాను. 2004 నుంచి 2011 వరకు ఏవోబీ గ్రేహౌండ్స్‌లో ఎస్ఐగా యలమంచిలి, నర్సీపట్నం రూరల్, అరకులో పని చేశా. 2012-13లో పెందుర్తి క్రైమ్ ఎస్సైగా, 2013-17 ఆనందపురం సివిల్ ఎస్సైగా బాధ్యతలు నిర్వహించాను. 2017 మార్చిలో ఆనందపురంలో ఉద్యోగోన్నతి వచ్చి సీఐ అయ్యాను. 2017 ఆగస్టు నుంచి 2020 వరకు విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో సీఐగా సేవలందించాను. 2020 జూన్‌లో శ్రీకాకుళం టూటౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించాను.

మీ పరిధిలో ఎంత మంది పనిచేస్తున్నారు?

మొత్తం 56 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో ఇద్దరు ఎస్సైలు, నలుగురు ఏఎస్సైలు, ఎనిమిది మంది హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఉన్నారు.

వృత్తిలో మీకు సవాల్‌గా నిలిచిన సంఘటనలు..?

2009 జూన్‌లో బలిమెల ఘటనలో 38 మంది ఏవోబీ గ్రేహౌండ్స్ కమాండోలను మావోయిస్టులు పొట్టనపెట్టుకున్న ఘటన తీవ్రంగా బాధించింది. ఏపీఎస్‌పీ ఎస్సైగా ఉన్న సమయంలో గ్రేహౌండ్స్ ఆపరేషన్‌లో పాల్గొన్నాను. 2017 -2020 విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా ఉన్నప్పుడు మైనర్‌బాలికను ఢిల్లీ వ్యభిచారంలోకి నెట్టిన 14 మందిని పట్టుకున్నాం. బాలికను రక్షించాం.

టూటౌన్‌లో మీకు గుర్తుండిపోయే కేసులు?

2021లో ఆదిత్యనగర్ హత్యకేసులో ఆరుగురు నిందితులను పట్టుకున్నాం. 2022 మేలో స్థానిక సాత్ఇండియా షాపింగ్ మాల్ దరిలో జరిగిన బంగారం చోరీకేసులో ఒడిశాకు చెందిన ఇరానీ గ్యాంగ్‌ను తమ టీమ్‌తో ఒడిశాలోని కరియా, జాజిపూర్ వెళ్లి రిస్క్ చేసి నిందితులను పట్టుకున్నాం. గత ఏడాది ఆగస్టులో కిమ్స్ డైరెక్టర్, ప్రముఖ వైద్యుడు గూడేన సోమేశ్వరరావును కిడ్నాప్ చేసేందుకు యత్నించిన కేసులో తక్కువ సమయంలో ఎనిమిది మంది నిందితులను పట్టుకుని కేసును ఛేదించాం. ఆరు బైక్‌ల చోరీ నిందితులను, ఒక గంజాయి కేసు నిందితులను పట్టుకున్నాం.

సైబర్ నేరాలు ఎలాంటివి?

మనీ ట్రాంజెక్షన్స్ పట్ల జాగ్రత్త వహించాలి. ఫేక్ యాప్స్, కాల్స్‌కు స్పందించకూడదు. ఉదాహరణకు మీషో ఆన్‌లైన్ షాపింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో మీ ఇంటి చిరునామాకు లెటర్స్ వస్తాయి. అందులో మొదటి బహుమతి అని ఉన్నవద్ద స్క్రాచ్ చేయండి అని ఉంటుంది. అలాంటి వాటికి దూరంగా ఉండాలి.

మీ సేవలకు వచ్చిన అవార్డులు..రివార్డులు?

మైనర్ బాలికను కాపాడిన ఏహెచ్‌టీయూ యాంటీ ఆపరేషన్‌లో ఉన్నందుకు 2019లో అప్పటి సీఐడీ డీజీపీ పి.వి.సునీల్ కుమార్ (ప్రస్తుతం డీజీపీ) చేతుల మీదుగా డస్క్ అవార్డు, జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక నుంచి 2021, 2022లో వరుసగా రెండుసార్లు ఫైరింగ్‌లో జిల్లా ఫస్ట్ రివార్డు, విజయనగరం పోలీస్ బెటాలియన్, ఏవోబీ గ్రేహౌండ్స్ తరఫున స్పోర్ట్స్‌లో నేషనల్, స్టేట్ అవార్డులు అందుకున్నా.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని సింగుపురం నుంచి తండ్యాలవలస వరకు రూ. 44.16 లక్షల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు పనులకు సోమవారం భూమి పూజ చేశారు. అలాగే సింగుపురం నుంచి కిష్టప్పపేట వరకు రూ.38.21 లక్షలతో ఏర్పాటు చేయనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే రోడ్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి నిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్య, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఎస్.కాంతిమతి, సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు, గొండు మోహన్, ఏఎంసీ చైర్మన్ మూకాళ్ల తాతబాబు, డీసీసీబీ డైరెక్టర్ గొండు కృష్ణమూర్తి స్వామి, రంధి రాజారావు, ఏఈ పీటీ రాజు, ఈఈ రవినాయక్, డీఈ గణపతిరావు, బగ్గు అప్పారావు, చిట్టి రవికుమార్, రుప్ప అప్పలసూరి, అల్లు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మ కాటాపై రైతుల ఫిర్యాదు



తక్కువ బరువు చూపించిన ధర్మకాటా ఇదే..

టెక్కలి: టెక్కలి మెళియాపుట్టి రోడ్‌లోని శ్రీలక్ష్మి వే బ్రిడ్జ్ (ధర్మకాటా)పై పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం కొనుగోలు చేసిన ధాన్యాన్ని వివిధ వాహనాల ద్వారా రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ముందుగా ధర్మకాటా వద్ద బరువు తూయించాలి. అయితే ఈ వేబ్రిడ్జ్ వద్ద ఏకంగా 70 కేజీలు తక్కువగా చూపించడంతో రైతులు ఆందోళన చెందారు. టెక్కలి మండలం సార్లిగాం గ్రామానికి చెందిన రైతు రామారావు తన ధాన్యాన్ని ట్రాక్టర్‌తో తీసుకువచ్చి ఇక్కడ బరువు తూయించారు. అతనికి చూపించిన బరువుపై అనుమానం వచ్చి మరో ధర్మకాటా వద్ద తూయించగా శ్రీలక్ష్మి వే బ్రిడ్జ్ వద్ద 70 కేజీలు తక్కువగా చూపించినట్లు గుర్తించారు. దీంతో రామారావుతో పాటు మరి కొంతమంది రైతులు వే బ్రిడ్జ్ వద్దకు వెళ్లి సిబ్బందిని నిలదీశారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దారు కిశోర్‌తో పాటు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు ధర్మకాటా వద్దకు చేరుకుని తూనికలు, కొలతల శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే వే బ్రిడ్జ్ మరమ్మతులకు గురికావడంతో తక్కువ బరువు చూపించినట్లు యజమాని వెల్లడించారు. కాగా ధర్మకాటా వద్ద తక్కువ బరువు చూపుతున్నట్లు బాధిత రైతు గుర్తించక ముందు ఎన్ని లోడ్లుకు తక్కువగా చూపించారోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చంద్రబాబు మీటింగులను బహిష్కరించాలి

- బాబు పబ్లిసిటీ పిచ్చికి అమాయక జనం మృతి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మీటింగులను జనం బహిష్కరించాలని, బాబు పబ్లిసిటీ పిచ్చికి అమాయక జనం చనిపోతున్నారని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ సభల్లో తొక్కిసలాటలపై బాధ్యులను గుర్తించి కేసులు నమోదు చేయాలని సూచించారు. కందుకూరులో 8 మంది, గుంటూరులో ముగ్గురు మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. కందుకూరు ఘటనకు చంద్రబాబుతో పాటు లోకేష్, రామోజీ, ఏబీఎన్, టీవీ-5 లు బాధ్యులని తెలిపారు. గుంటూరులో కానుకలు ఇస్తామని చెప్పి అధిక మందికి ఆశ చూపి జనాలను రప్పించారని విమర్శించారు. ఈ సంఘటనలను దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు సభలపై కఠిన ఆంక్షలు విధించాలని, సభలను నిషేధించాలని అభిప్రాయపడ్డారు.

ప్రజల ప్రాణాలతో చంద్రబాబు చెలగాటం

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: చంద్రబాబు ప్రచార పిచ్చి కోసం ప్రజల ప్రాణాలను తీస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తన సభలకు ఎక్కువ మంది జనాలు వస్తున్నారని భ్రమ కలిగించేందుకు.. తన అనుకూల మీడియాలో ప్రచారం చేసుకునేందుకు డ్రోన్ కెమెరాలతో షూటింగ్ కోసం మితిమీరి ప్రవర్తిస్తూ అమాయక ప్రజల ప్రాణాలు తీస్తున్నారన్నారు. చంద్రబాబుకు ప్రజలపై ప్రేమ ఉంటే రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో అతని పార్టీ నాయకులతో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు చీరలు, కానుకలు పంపిణీ చేయవచ్చు కదా? అని ప్రశ్నించారు. అమాయకులైన ప్రజలను తీసుకొచ్చి, ఇరుకు ప్రదేశాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి.. కార్యకర్తలను రెచ్చగొట్టి ప్రజలను తొక్కి చనిపోయేలా చేసి చంద్రబాబు ఎక్కువ మంది ప్రజలు వస్తున్నారని ప్రచారం చేసుకోవాలనుకోవటం శవరాజకీయమే అవుతుందన్నారు. గోదావరి పుష్కరాల సందర్భంగా షూటింగ్ కోసం స్నానాలకు వచ్చిన 30 మంది భక్తులు మృతి చెందారని గుర్తు చేశారు. వారం రోజుల క్రితం కందుకూరులో జరిగిన తొక్కిసలాటలో 8 మంది, ఆదివారంగుంటూరులో జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు మహిళలు మృతి చెందడం విచారకరమన్నారు. ఇదంతా రాజకీయ ప్రచారం కోసం చంద్రబాబు పడుతున్న ఆర్భాటమే అన్నారు. 2019 ఎన్నికల ముందు పసుపు, కుంకుమ పేరుతో మహిళలకు డబ్బులు పంపిణీ చేసినప్పటికీ ఆ ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. 2024 ఎన్నికల ముందు చీరలు, కానుకలు పంపిణీ చేస్తున్న అతనికి వచ్చే ఎన్నికల్లోను మరోసారి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

రాష్ట్రానికి పట్టినపీడ చంద్రబాబు

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



లావేరు: చంద్రబాబు రాష్ట్రానికి పట్టిన పెద్ద పీడని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రావివలస గ్రామంలో సోమవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు సమావేశాలకు జనాలు రాకపోవడంతో ఎక్కువ మంది వస్తున్నట్టు ప్రజలను నమ్మించేందుకు, మీడియాలో చూపించడానికి పడరానిపాట్లు పడుతున్నారన్నారు. ఇందులో భాగంగానే ఇరుకు సందుల్లో సమావేశాలు పెట్టడంతో కందుకూరులో ఎనిమిది మంది, గుంటూరులో ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఎలాగైనా సీఎం కావాలనే ఉద్దేశంతో ఇదేంఖర్మ, నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాలు చేపడుతూ అమాయక ప్రజలను చంపేస్తున్నారన్నారు. గోదావరి పుష్కరాల సమయంలో కూడా ఎక్కువ మంది చనిపోవడానికి చంద్రబాబుతీరే కారణమన్నారు. చంద్రబాబు 11 మందిని చంపేశారని, అతని కొడుకు లోకేష్ పాదయాత్ర చేసి ఎంతమందిని చంపేస్తాడోనని ప్రజలకు భయం పట్టుకుందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ ఉన్నారు.

ఈ నెలాఖారులో వైఎస్సార్ ఆసరా అందజేత



మెప్మా పీడీ కిరణ్‌కుమార్‌తో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: ఆడపడుచుల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి అందిస్తున్న వైఎస్సార్ ఆసరా పథకాన్ని అందించడానికి సమయం ఆసన్నమైందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలోని క్యాంప్ కార్యాలయం వద్ద జిల్లా మెప్మా పీడీ కిరణ్‌కుమార్‌తో సోమవారం మాట్లాడి వైఎస్సార్ ఆసరాపై ఆరా తీశారు. పథకానికి సబంధించి గ్రౌండ్ వర్క్ ఎంతవరకు వచ్చిందని, అలసత్వం లేకుండా పూర్తి చేయాలని పీడీని మంత్రి కోరగా.. ఈ నెల చివరి వారంలో అందించడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. టెక్నికల్ సమస్య తలెత్తకుండా కిందిస్థాయి సిబ్బందితో చర్యలు చేపట్టాలన్నారు. మెప్మా పీడీ మాట్లాడుతూ..పలాస మున్సిపాలిటీలో ఉన్న 826 సంఘాలకు సంబంధించి నాలుగు విడతల్లో రూ.28 కోట్లు మంజూరైనట్టు చెప్పారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ టీఎంసీ బోర భాస్కరరావు ఉన్నారు.

జిల్లా క్రికెట్ జట్టుకు పెద్దతామరాపల్లి విద్యార్థి



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నందిగాం: పెద్దతామరాపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి మద్దిల దివాకర్ జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు పేడాడ అమ్మన్నమ్మ తెలిపారు. దివాకర్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-14 విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికైనట్టు పేర్కొన్నారు.

ఈ నెలలో కృష్ణా జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా తరఫున దివాకర్ ఆడుతాడని చెప్పారు. అలాగే ఇటీవల జరిగిన గ్రిగ్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన బాలికలు జూనియర్ విభాగం కబడ్డీలో ప్రథమం, ఖోఖోలో ద్వితీయ స్థానంలో ప్రతిభ చూపారన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని అలవర్చుకోవాలి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు అలవర్చుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. గొలివివానిపేట గ్రామంలో రబీ సీజన్‌లో పంటలసాగుపై పొలంబడి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించి అవగాహన కల్పించారు. ఆరుతడి, అంతర పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వేరుశనగ, పెసర, మినప, మొక్కజొన్న, పొద్దు తిరుగుడును అంతర పంటలుగా సాగు చేయాలన్నారు. రబీలో వరి కంటే వాణిజ్య పంటల సాగు వల్ల రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. పంటల యాజమాన్యపు ఖర్చులు ప్రకృతి వ్యవసాయ సాగు వల్ల తగ్గుతాయని చెప్పారు. సిబ్బంది లక్ష్మున్నాయుడు, రామకృష్ణ, సిమ్మయ్య పాల్గొన్నారు.

108 వాహనంలో ఆడబిడ్డ జననం



బిడ్డను చూపిస్తున్న 108 ఉద్యోగి ఈశ్వరరావు

లావేరు: 108 వాహనంలో ఓ తల్లి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. కొత్తకుంకాం గ్రామానికి చెందిన గర్భిణి లింగాల ఇందుకు సోమవారం నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు లావేరు మండల 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో సిబ్బంది కె.ఈశ్వరరావు, రామారావు కొత్తకుంకాం గ్రామానికి వెళ్లి ఇందును శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రసవ నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఆశ కార్యకర్త సహకారంతో అంబులెన్సులోనే సుఖ ప్రసవం జరిపించారు. ఆడబిడ్డకు జన్మనివ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగానే ఉన్నారని వాహన సిబ్బంది చెప్పారు.

పలువురు సీఐలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలోని పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు, పోస్టింగ్‌పై ఉత్తర్వులు జారీ చేశారు.

రెండో పట్టణ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఆర్ఈసీహెచ్ ఈశ్వరప్రసాద్ ఇచ్ఛాపురం బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో విశాఖ రేంజ్‌లో వీఆర్‌లో ఉన్న పి.శ్రీనివాసరావును నియమించారు. ఇచ్ఛాపురంలో పనిచేస్తున్న డీవీవీ సతీష్‌కుమార్ శ్రీకాకుళం దిశ మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. శ్రీకాకుళం సీసీఎస్‌లో సీఐగా ఉన్న ఎస్.అదమ్ జె.ఆర్.పురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రానుండగా.., జె.ఆర్.పురంలో పని చేస్తున్న బి.సి.హెచ్.స్వామినాయుడు విశాఖ రేంజ్ వీఆర్‌కు వెళ్లనున్నారు.

బ్యాంక్ ఖాతా నుంచి రూ.78వేలు స్వాహా

హిరమండలం: మండలంలోని శుభలయ వంశధార పునరావాస కాలనీకి చెందిన లంక రామారావుకు చెందిన ఎస్‌బీఐ బ్యాంక్ ఖాతా నుంచి విడతల వారీగా రూ.78వేలు సైబర్ నేరగాళ్లు స్వాహా చేశారు. ఆయన ఆలస్యంగా గుర్తించడంతో నష్టం ఎక్కువగా జరిగింది. గత ఏడాది డిసెంబర్ నెల 17వ తేదీ నుంచి జనవరి రెండో తేదీ (సోమవారం) వరకు విడతల వారీగా రూ.78వేలు స్వాహా చేశారు. తనకు జరిగిన నష్టాన్ని ఆలస్యంగా గుర్తించిన బాధితుడు రామారావు, బ్యాంక్ అధికారులకు సోమవారం పిర్యాదు చేశారు.

ఆధార్ కార్డు బయోమెట్రిక్ ఆధారంగా డబ్బు స్వాహా జరిగి ఉంటుందని బ్యాంక్ అధికారులు చెబుతున్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ మృతి



చుక్కారావు (ఫైల్)



రామకృష్ణ కుటుంబానికి సాయాన్ని అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని ఆర్మడు రిజర్వు కార్యాలయంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ గురుగుబెల్లి చుక్కారావు (50) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈయనిది ఎచ్చెర్ల మండలం కొత్తపేట గ్రామం కాగా తోటపాలెం పంచాయతీ తవిటయ్యనగర్‌లో నివసిస్తున్నారు.

ఆర్థిక సహాయం అందజేత

చుక్కారావు మృతిపై పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు సంతాపం తెలియజేశారు. అసోసియేషన్ తరఫున అతని భార్య భాగ్యలక్ష్మికి లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అలాగే రణస్థలం పోలీసు స్టేషన్‌లో పని చేస్తూ ఇటీవల చనిపోయిన హెడ్‌కానిస్టేబుల్ కేవీ రామకృష్ణకు కూడా అసోసియేషన్ ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ఎచ్చెర్లలో ఉంటున్న అతని భార్య సుధాదేవికి లక్ష రూపాయలను సంఘ నాయకులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై సత్యనారాయణ, అసోసియేషన్ ప్రతినిధులు రాధాకృష్ణ, కృష్ణంనాయుడు, భుజంగరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అన్నమయ్య గీతాలు



అన్నమయ్య గీతాలాపన చేస్తున్న లక్ష్మి బృందం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని చిన్నబజారులో ఉన్న దూదివారి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం సాయంత్రం జరిగిన అన్నమయ్య భక్తి గీతాలాపన చక్కగా ఆకట్టుకుంది. షిర్డీసాయి సంగీత విద్యాలయం నిర్వాహకురాలు మల్లెమొగ్గల లక్ష్మి ఆధ్వర్యంలో పలు అన్నమయ్య కీర్తనలను వీనుల విందుగా గానం చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని వీక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సర్వేశ్వరరావు పాల్గొన్నారు.